విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

సోమవారం 30 జూన్ 2025 | 8 పేజీలు

పోలీసు శాఖలో
కృత్రిమ మేధా

- రానున్న ఆరు నెలల్లో అమలు చేస్తాం
- నేరాల నియంత్రణకు ఇది దోహదం
- రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : కృత్రిమ మేధాను వినియోగించుకొని ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలన్నా సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా దేశంలోనే తొలిసారి రాష్ట్ర పోలీస్ శాఖ ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాక్థాన్ 2025ను విజయవంతంగా నిర్వహించిందని రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా తెలిపారు. గుంటూరు రూరల్ చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జెసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాక్థాన్ 2025 ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర డిజీపీ హరిష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్ర డీజీపీ హరిష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ మిగతా 2 లో ...

హామీలు అమలు చేయాలి

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-పెదకాకాని : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ మహాసభ పెదకాకానిలోని పుప్పాల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు గుంటూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ పొన్నూరు నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన నిరుపేద లకు రెండు సెంట్లు స్థలాలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు మూడు సెంట్లు స్థలాలు కేటాయించి గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాగ్దానాలూ నెరవేర్చే వరకు సీపీఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. మేడా హనుమంతరావు మాట్లాడుతూ కార్మికులు శతాబ్దాలుగా పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. అదేవిధంగా 8 గంటల పని సమయాన్ని 10 గంటలకు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా సీఎం చంద్రబాబు నాయుడు అంగీకరించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట మాల్యాద్రి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో మిగతా 2 లో ...

లాయర్లకు 'సంక్షేమం' వర్తింపచేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: న్యాయవాద వృత్తినే జీవనాధారంగా ఉన్న వాళ్ళలో చాలామంది ఆర్థిక సమస్యలతో సతమతం అవుతూ ఉన్నారని, వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. న్యాయవాదులశాఖ సీపీఐ 14వ మహాసభ ఎంఎ షరీఫ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. పేదరికంలో అనార్యోగంతో ఎలాంటి ఆదరణలేని న్యాయవాదులకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేయాలని తీర్మానించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ చట్టసభలో కమ్యూనిస్టులు లేని లోటు ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, పాలక కూటమి, బిజెపి ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తూ ఉన్నాయని తెలిపారు. పోరాడి సాధించుకున్న చట్టాలు నిర్వీర్యం చేస్తూ ఉన్నారని, ప్రభుత్వ రంగ సంస్థల్ని మిగతా 2 లో ...

దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

2

బంద్‌ను జయప్రదం చేయండి

4

ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు
జిల్లాస్థాయి పురస్కారాలు

- మూడు విభాగాల్లో ఫొటోగ్రఫీ డే పోటీలు
- ఎంట్రీలు పంపేందుకు చివరితేదీ జులై 31 : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఆగస్టు 19సందర్భంగా విశేష ప్రతిభకనబరిచిన ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేయడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీ శ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు . ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఫొటో జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు పోటీలలో పాల్గొనవచ్చునన్నారు. ఫొటోగ్రాఫర్లు జులై 31వ తేదీలోగా తమ ఎంట్రీలు పంపాల్సి ఉంటుందన్నారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని మొదటి విభాగంలో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు,

స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్టీఆర్, యోగాంధ్ర అంశాలకు సంబంధించి ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, మిగతా 2 లో ...

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు
విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకి, తల్లిదండ్రులకి యువగళం పాదయాత్రలో మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

హామీలు అమలు చేయాలి

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ ఈ సమస్యలపై అధ్యయనం చేసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు కేటాయించి గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం ఇవ్వాలని, పెదకాకాని సెంటర్‌లో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని, వెనిగండ్ల వెళ్లే మార్గంలో కెనరా బ్యాంకు వద్ద మెరక చేసి మురుగునీరు పారేలా సైడ్ కాలువ ఏర్పాటు చేయాలని తదితర ఐదు తీర్మానాలు మహాసభలో ఆమోదించారు.

పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శిగా పుప్పాల:

మహాసభ అనంతరం సీపీఐ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శిగా పుప్పాల సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా కొల్లి రంగారెడ్డి, ఆరేటి రామారావు, రెంటాల కుమారి, పాటిబండ్ల డేవిడ్‌రాజు, షేక్ గౌస్, కూసం నాగిరెడ్డి, షేక్ బాజీద్, కేతినేని అగస్టీన్, రావూరి సుగుణలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అకిటి అరుణ్ కుమార్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి గుండెబోయిన లక్ష్మి, ఏఐటీయూసీ గుంటూరు నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, బట్టు నాగేశ్వరరావు, గోపి, సుబ్బారావు, మండే రవి, దర్శి లింగారావు, నారా ప్రసాదు, ఎన్.సత్యనారాయణ, ఉయ్యూరు సీతారామయ్య, రమణ, తాండవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లాయర్లకు 'సంక్షేమం' వర్తింపచేయాలి

కార్పొరేట్ పరం చేస్తున్నారని అవినీతి ఎంత అందలం ఎక్కుతుందో ఒకే సారి కూలిపోతుందని స్పష్టం చేశారు. జూలై 16, 17లలో నగర మహాసభలు ఆగస్టు 23,24,25 లలో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగనున్నాయని వివరించారు. సీపీఐ న్యాయవాదుల నగరశాఖ కార్యదర్శిగా చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ మరణించిన న్యాయవాది కుటుంబాలకు సంక్షేమ నిధి నుండి పరిహారం ఇవ్వాలని ఈవోఐ వర్తింప చేయాలని కోరారు. సహాయ కార్యదర్శులుగా కే మధుసూదనరావు, జి శ్రీనివాసరావు, ఎంపికయ్యారు. ఈ సభలో పార్టీ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, న్యాయవాదులు శాఖ ప్రతినిధులు బోను జయమ్మ, కే వి పరమేశ్వరరావు, సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

ఎన్నికల ప్రచారంలో భాగంగా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా కేవలం రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. బడ్జెట్ సమావేశాల నాటికి ఈ రాష్ట్రంలో రూ.3900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2600 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివా, యశ్వంత్, ఉపాధ్యక్షులు ప్రణీత్, అమర్నాథ్, సహాయ కార్యదర్శి డేవిడ్, కిరణ్, అజయ్, అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో కృత్రిమ మేధా

రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జూన్ 27 నుంచి 29 వరకు నాలెడ్జ్ పార్టనర్ 4 సైట్ ఏఐ కంపెనీ, ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల హోస్టింగ్‌తో ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాకథాన్ 2025 నిర్వహించటం జరిగిందన్నారు. హ్యాకథాన్‌కు 160 మంది దరఖాస్తు చేసుకోగా వాటిలో జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ 60 కంపెనీలను, ఏఐ నిపుణులను ఎంపిక చేసుకొని కృత్రిమ మేధా సహాయంతో నేరాలు నియంత్రణ, పర్యవేక్షణ, దర్యాప్తులోని సవాళ్ళకు ఉత్తమమైన పరిష్కారాలను ఆవిష్కరించటం జరిగిందన్నారు. రాష్ట్రంలోని 30 మందికిపైగా సీనియర్ ఐపీఎస్ అధికారులు, యువ ఐపీఎస్‌లు నేరాల నియంత్రణ, దర్యాప్తులో ఉన్న అనేక సమస్యల పరిష్కారాలకు ఏఐ నిపుణుల సహాయంతో కృత్రిమ మేధాను వినియోగించుకునే ప్రక్రియపై నిర్వహించిన కసరత్తు ఫలవంతమైందన్నారు. హ్యాకథాన్‌లో ఎనిమిది విభాగాల్లో నిర్వహించిన పోటీలలో విజేతలకు రూ.75 వేలు, రన్నర్లకు రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.10 లక్షల విలువ కలిగిన నగదు బహుమతులను రాష్ట్ర డీజీపీ హరీష్ గుప్తా అందించారు. సమావేశంలో ఐజీపీలు సీహెచ్ శ్రీకాంత్, బి.రాజకుమారి, ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు, ఏఐ కంపెనీలు, నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయి పురస్కారాలు

ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం – 2 ఉన్నాయని, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ (రూ. 10 వేలు), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 4 వేలు) బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక సెక్షన్ నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు సెక్షన్ల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చు. వాటర్ మార్క్, మార్ఫింగ్ వంటి వాటిని అనుమతించడం జరగదు. ఉత్తమ ఫొటోల ఎంపిక విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయమని, ఒరిజినల్ ఫొటో ఎంట్రీలను డీపీఆర్వో కార్యాలయం, స్టేట్ గెస్ట్ హౌస్, విజయవాడ, చిరునామాకు నేరుగా లేదా పోస్టల్ ద్వారా సమర్పించవచ్చునని ఇతర వివరాలకు 9121215373 నందు సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

సమస్యలను గాలికొదిలేసిన ఎమ్మెల్యే

ప్రజల సమస్యలపై పోరాటాలు తథ్యం : 1, 2వ డివిజన్ రెండవ మహాసభల్లో లంకా దుర్గారావు

విశాలాంధ్ర-విజయవాడ: డివిజన్ స్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యలను స్థానిక ఎమ్మెల్యే గాలికొదిలేచాడని, సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధంకావాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు పిలుపునిచ్చారు. 1వ డివిజన్ పడాల సన్యాసిరావు గ్రంథాలయం, 2వ డివిజన్ బుడమేరు కరకట్ట లెనిన్ నగర్ చంద్ర రాజేశ్వరరావు యువజన గ్రంథాలలంలో ఇరు డివిజన్‌ల ఇన్‌ఛార్జి కొడాలి ఆనందరావు, పార్టీ నాయకురాలు ఖైరునిసబేగం అధ్యక్షతన రెండవ మహాసభలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన లంకా దుర్గారావు మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిగా విస్మరించారని, హామీలు అమలుకు కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. రాజధాని పరిధిలో ఉన్న విజయవాడలో తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, కొండప్రాంతాల్లోని మెట్లమార్గాలు మరమ్మత్తులు, విద్యుత్ స్థంభాల ఏర్పాటు తదితర సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. బుడమేరు కరకట్టపై తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు రక్షణ కల్పించాలని మురుగునీరు కారణంగా దోమలు తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. ఈ మహాసభల్లో పార్టీ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గ సభ్యులు అప్పురబోతు రాము, కార్యవర్గ సభ్యులు దోనేపూడి సూరిబాబు, 6వ డివిజన్ కార్యదర్శి పడాల కనకరావు, పార్టీ నాయకులు పాపి నాయుడు, వై బాబురావు, ఎండీ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక :

1వ డివిజన్ నూతన కమిటీ కార్యదర్శిగా షేక్ అలీ, సహాయ కార్యదర్శిగా షేక్ మస్తాన్‌భాషా, సభ్యులు ఎన్నికయ్యారు, 2వ డివిజన్ నూతన కమిటీ కార్యదర్శిగా అయిత ఆంజనేయులు సహాయ కార్యదర్శిగా పి ప్రసాద్, సభ్యులు ఎన్నికయ్యారు.

మానవత సేవలు గర్వకారణం

విశాలాంధ్ర-విజయవాడ: స్వచ్ఛంద సేవా సంస్థ మానవత నగర సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక జిల్లా సీనియర్ సిటిజన్స్ హాల్ నందు జరిగింది. 2025- 26 కు అధ్యక్షులుగా న్యాయవాది పగిడిపల్లి రాము కార్యదర్శిగా దావులూరి సాంబశివరావు ఎన్నికయ్యారు . నూతన కమిటీ చేత మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబో యిన కోటేశ్వరరావు ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో బుడమేరు వరదల వల్ల నష్టపోయిన పేద విధ్యార్థి చదువు నిమిత్తం రూ 5 వేలు, అనారోగ్యంతో మంచాన పడ్డ కుటుంబానికి రూ 5 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. సమావేశంలో కోటేశ్వరరావు మాట్లాడుతూ వరదలు కూడా లెక్క చేయకుండా ముంపు ప్రాంతాల్లో సేవలు అందించడం గర్వకారణం అన్నారు. అవసరం ఉన్నచోట సమాజ సేవ చేయాలని అన్నారు. కోశాధికారిగా రంగు వెంకట దుర్గా ప్రసాద్ కార్యవర్గ సభ్యులుగా సుబ్బారావు, మొవ్వ శైలజ, నందిగం రఘునాథ్, భూపతి రాజు సత్యనారాయణ, కుమారబాబు ఉన్నారు. ఈ సమావేశంలో కే రామ మోహన్, పొట్లూరి వీర శేషగిరిరావు, దండమూడి జయలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గమ్మకు తెలంగాణ బంగారు బోనం

విశాలాంధ్ర-విజయవాడ (ఇంద్రకీలాద్రి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గ అమ్మవారిని దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ వారి ఆధ్వర్యంలో విజయవాడ కనకదుర్గ అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించే ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. దుర్గమ్మ వారికి హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల సభ్యులు బంగారు బోనం సమర్పించారు. 500 మంది కళాకారులు విచిత్ర వేషాలు, పోతురాజులు డప్పులు, కోలాటాలతో బ్రాహ్మణ వీధి నుంచి ఘాట్ రోడ్డు మీద దుర్గమ్మ చెంతకు బంగారు బోనం చేరుకుంది.దేవస్థానం నుంచి ఆంధ్రప్రదేశ్ కళారూపాలైన చిన్నారుల నెమలి నృత్యం, కరగం నృత్యం, తప్పెట్లు, కోలాటం, సంప్రదాయ భజనలు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాలు పాడిపంటలతో, సుఖశాంతులతో, అభివృద్ధి పథంలో దూసుకు వెళ్లాలని బంగారు బోనం సమర్పించారు. దుర్గగుడికి చేరుకున్న బంగారు బోనాన్ని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు మేరకు, బోనం సమర్పించడానికి తెలంగాణ నుంచి వచ్చిన కమిటీ సభ్యులకు, భక్తులకు ఏటువంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వి. కె. శీనా నాయక్ స్పష్టం చేశారు.

విజయవాడలో అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలతో వైస్ హాస్పిటల్స్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్ : విజయవాడ నగరంలోని కానూరు పంటకాలువ రోడ్డులో వైస్ హాస్పిటల్స్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఆధునిక వైద్య సదుపాయాలు, నూతన సాంకేతికత మరియు మానవతాదృ క్పదంతో నిర్మితమైన ఈ హాస్పిటల్ స్థానిక ప్రజలకు విశ్వసనీయ వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. వైస్ హాస్పిటల్లో సర్జికల్ మరియు మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజి, గైనకాలజి, ఆబ్స్టెట్రిక్స్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజి, రేడియాలజి, ఈఎన్టి, ఆర్థోపెడిక్స్ వంటి విభాగాల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారన్నారు. గౌరవ అతిథులుగా కొల్లు రవీంద్ర- మైన్స్ జియాలజీ శాఖ మంత్రి, బోడె ప్రసాద్-ఎమ్మెల్యే, పెనమలూరు, గద్దె రామ్మోహనరావు- ఎమ్మెల్యే, విజయవాడ ఈస్ట్ రాజగోపాల్ (శ్రీరాం- ఎమ్మెల్యే, జగ్గయ్యపేట, పవన్ వెలినేని-డియన్బి (సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాజలి ఏఐజి, హైదరాబాద్) లు హాజరయ్యారు.

గుబాళించిన స్వరలయ సౌరభం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఉన్నత శ్రేణి సంగీత విద్వాంసులతో నెలవారీ సంగీత సభలు, వర్ధమాన కళాకారులకు పోటీలు నిర్వహించి వారికి వేదికలు కల్పిస్తూ శాస్త్రీయ సంగీత పరిరక్షణకు వ్యాప్తికి సేవలందిస్తున్న శ్రీసుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఇటీవల నిర్వహించిన సంగీత పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. సంగీత సమితి కార్యాలయంలో స్టార్ హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో విజేతలు వారి వారి కృషిని చాటుకున్నారు.

విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు : పిడుగు

విశాలాంధ్ర-ఘంటసాల: విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ- 2 మహమ్మద్ మోమిన్ , కలిదిండి విశ్రాంతి ఎంఈఓ పిడుగు ప్రభాకర రావు అన్నారు. ఆదివారం గోగినేని పాలెం లో ఆచార్య ఎన్జీరంగా జడ్పీ పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయులు నాదెళ్ల బసవేశ్వర రావు ఉద్యోగ విరమణ సందర్భంగా విశ్రాంత ఎంఈఓ వేమూరి మురళీకృష్ణ అధ్యక్షతన అభినందన సభను నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఏఎంసీ ఉపాధ్యక్షులు అత్తలూరు గోపీచంద్ సర్పంచ్ కుంపటి సుశీల ,ఎస్ఎంసి చైర్మన్ కుంపటి జీవన్ కుమార్, అంతర్జాతీయ టెన్నిస్ కోచ్, క్రీడా కారుడు అన్నే రత్నాకరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లంపాటి పిక్చర్స్ రావు గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ విశ్రాంత ఎంఈఓ నూతక్కి కోటేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు ఎల్ కృష్ణకుమారి, శివ కోటేశ్వరరావు, తమ్మన వేణుగోపాలరావు, కొండపల్లి లక్ష్మీకుమారి, మత్తి హరి గోపాల్, ఎన్ సుధాకర్ రావు, పిడి రామారావు , తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం సీపీఐ పోరాటం

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : ఎస్ఐ

విశాలాంధ్ర-పెదపారుపూడి : రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి జీవిస్తే షీట్లను తొలగించటానికి సహకరిస్తామని పెదపారు పూడి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తుకు, చెడు వ్యసనాలకు, కొత్త నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్ప వని, గ్రామ బహిష్కరణ వేటు తప్పదని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

విశాలాంధ్ర-కూచిపూడి : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై మొవ్వ మండలంలోని నిడుమోలు వద్ద ఆదివారం ఉదయం హైదరాబాదు నుంచి మచిలీపట్నం మీదుగా వెళ్తున్న (రాజోలు) అమలాపురంకు ఎస్.ఎల్.07.0847 ప్రైవేట్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. బస్సులో 31 మంది ప్రయాణికు లకు ఏ విధమైన ప్రమాదం జరగలేదు. విద్యుత్ శాఖ ఏఈ రమేష్, ఎల్ఐ శ్రీహరి సిబ్బందితో విద్యుత్‌ను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయస్థాయి స్కేటింగ్ పతకాలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈ నెల 18 నుంచి 23 వరకు వెస్ట్ బెంగాల్లోని కలకత్తాలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ లో నగరానికి చెందిన సిహెచ్ రత్న రాజ్ పలు విభాగాల్లో పథకాలు సాధించినట్లు కోచ్ మకాని శరత్ కుమార్ తెలిపారు. నగరంలోని కేబీఎన్ కళాశాలలో చదువుతున్న రత్న రాజ్ వెయ్యి మీటర్ల రోడ్ రేస్ లో బంగారు పతకం, 2000 మీటర్ల రోడ్ రేస్ లో ప్రజల పథకం, రోడ్డు 1 లాప్ రేస్ లో కాంస్య పథకం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పథకాలు సాధించిన రత్నరాజును, టి. హర్షిత, ఆర్.అరుణ్ బాబు, కె.రోషన్, సాయి, రాహుల్, మేనేజర్, టి. రవికాంత్ జి దుర్గాకుమార్ కోఆర్డినేటర్ కరిముల్లాను కోచ్ మాకాని శరత్ కుమార్ అభినందించారు.

వేముల హేమంతుకు సన్మానం



విశాలాంధ్ర-పల్లపల్లి : సీఏపి లో జాతీయస్థాయిలో 36వ ర్యాంకు సాధించి న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్లో 12వ నేషనల్ స్టూడెంట్స్ కన్వకేషన్లో పతకం, ప్రశంసాపత్రం సాధించిన వేముల హేమంత్ను, తల్లిదండ్రులు పాండురంగారావు.. దీపికలను ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు బోలెం రామారావు ఆధ్వర్యంలో సన్మా నించారు. ఎన్టీఆర్ పార్కులో విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు నూకల లక్ష్మ య్య, కైతేపల్లి దాస్, బుల్లా కిషోర్, ఉప్పల సాంబశివరావు, శంకర రావు, కోడూరు వెంకటేశ్వరరావు, రావెళ్ల ఉదయ్కుమార్, కొల్లిపర మధు, ముమ్మనేని సన్నీ, షణ్ముఖ శ్రీనివాస్, పాల్గొన్నారు.

జులై 4న సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ మహాసభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : సీపీఐ సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా తాడిత, పీడిత ప్రజల కోసం, కార్మిక, కర్షక వర్గాల ప్రయోజనాల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూనే ఉందన్నారు. దళిత, గిరిజన, మైనారిటీ, బలహీన వర్గాల వారి హక్కుల రక్షణ కోసం, వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం, నిర్విరా మంగా కృషి చేస్తున్నదన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఉన్న పిల్లలమర్రి భవన్‌లో సీపీఐ నియోజకవర్గ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావులు మాట్లాడుతూ నిత్యం ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ నియోజకవర్గ మహా సభలు 2025 జులై 4 జరుగనున్నాయన్నారు. ఈ మహాసభ లలో పలు సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాన్ని నిర్మించుకోనేలా ఈ మహాసభ వేదిక కానునదన్నారు. ఈ మహాసభల నిర్వహణకు ఆర్థిక సహకారాన్ని అందించి మహా సభలను జయప్రదానికి సహకారం అందించాలని ఆదివారం ప్రతి ఒక్క పార్టీ సభ్యులను, పార్టీ అభిమానులకు విజ్ఞప్తి చేస్తూ కరపత్రాన్ని విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు పోతుపాక వెంకటేశ్వర్లు, షేక్ అసదుల్లా, మాశెట్టి రమేష్, మెటికల శ్రీనివాసరావు, నీలకంఠం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే పెట్రోలింగ్ వాహనాలు : డీఎస్పీ

విశాలాంధ్ర గన్నవరం : ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు గన్నవరం సబ్ డివిజన్ డిఎస్పి చలసాని శ్రీనివాసరావు అన్నారు. కృష్ణాజిల్లా పోలీస్ డిపార్ట్మెంట్‌కు కేటాయించిన ట్రాఫిక్ వాహనాలను కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు గన్నవరం ట్రాఫిక్ లిమిట్స్ లో ట్రాఫిక్ నియంత్రణ కొరకు నాలుగు మోటార్ వాహనాలను కేటాయించటం జరిగింది. ఆయన ఉత్తర్వుల మేరకు గన్నవరం ఎస్.డి.పి.ఓ చేతుల మీదుగా వాహా లను ప్రారంభించటం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో పోలీస్ సిబ్బందికి ఈ వెహికల్స్ ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ సిఐ శివప్రసాద్, ట్రాఫిక్ సిఐ పెద్దిరాజు, ట్రాఫిక్ ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-గుడివాడ : రౌడీషీటర్లు అల్లరులకు దూరంగా ఉండి మంచిగా జీవిస్తే రౌడీషీట్లను ఉన్నతా ధికారులతో మాట్లాడి ఎత్తివేసే విధంగా చర్యలు తీసు కుంటామని రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. ఆదివారం స్థానిక తాలుకా పోలీసుస్టేషన్‌లో రూరల్ పరిధిలోని రౌడీషీటర్లుకు ఎస్ఐ చంటిబాబు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో రౌడీషీటర్లు ఎంతో మందికి సేవా చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. రౌడీషీటర్లు గొడవలకు, కొట్లలకు దూరంగా ఉండలన్నారు. ఈ కార్యాక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. 1 టౌన్ పరిధిలో రౌడీషీటర్లుకు సిఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1 టౌన్ పరిధిలో రౌడీషీటర్లు మీ ప్రాంతాలలో ఏ విధమైన అ సంఘిక కార్యక్రమాలు జరిగిన వాటికి దూరంగా ఉండలన్నారు.

మామిడి తోటలో గుర్తుతెలియని మృతదేహం

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలోని రేపూడి గ్రామ సమీపన ఒక రైతుకు చెందిన మామిడి తోటలో కుళ్ళిపోయి గుర్తు పట్టడానికి వీలులేని స్థితిలో ఒక మృతదేహం లభ్యమైంది. ఏ కొండూరు ఎస్ఐ టి.కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రేపూడి గ్రామ సమీపాన ఒక మామిడి తోటలో కుళ్ళిపోయిన మృతదేహం వాసన వస్తుండటంతో స్థానికులు గుర్తించి ఆ విషయాన్ని తమకు తెలియజేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని రెడ్డిగూడెం మండలం పాత మద్దుల పర్వ గ్రామానికి చెందిన కోట రాము (46)గా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కోటా రాము గత మూడు రోజులుగా కనిపించడం లేదని రాము కోసం తాము వెతుకుతున్నట్లు చెప్పినట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహానికి శవపంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షా శిబిరం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 172వ ఉచిత కంటి శు క్లముల వైద్యశిబిరం జరిగింది. శిబిరంలో డాక్టరు బి.మోహనరావు 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 33 మందిని ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమని గుర్తించగా, వారికి విజయవాడ అమరావతి కంటి ఆసుపత్రిలో బుధ, గురువా రాల్లో ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వదరా హరిగో పాల్, వరదా రాజశేఖర్, దేసు జయలక్ష్మి, దింట కుర్తి జ్యోతి, గోళ్ల ద్రోణపూర్ణచంద్రరావు, తమ్మన సతీష్ కుమార్, జూపూడి కిరణ్, మలిశెట్టి చెంచురాములు, నంబూరు కుసుమ, కొల్లిపర సురేంద్ర, నరేంద్ర తదితరులు పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు. సీఏపిలో జాతీయస్థాయిలో 36వ ర్యాంకు సాధించి న్యూఢిల్లీలో ప్రశంసాప త్రం, పతకం సాధించిన షణ్ముఖ జనరల్ స్టోర్స్ అధినేత వేముల పాండురంగారావు. దీపికల కుమారుడు హేమంతును సన్మానించారు.

బంద్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: దేశవ్యాప్తంగా కార్మికసంఘాలు కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. విస్సన్నపేటలో ఆదివారం మండలకమిటీ సమావేశం నిర్వహించారు. మండల కమిటీ సభ్యుడు నందికోళ్ల రాజేష్ అధ్యక్షతన మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు నాయకత్వంలో జరిగిన ఈ సమావేశానికి హాజరైన నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా పనిచేస్తున్న సిపిఐ జిల్లా మహాసభలు ఆగస్టు 1,2 తేదీల్లో నిర్వహించనున్నారని, అన్ని వర్గాల ప్రజలు ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించిన ఎనిమిది గంటల పని విధానం స్థానంలో పది గంటల పని విధానం ప్రవేశపెట్టేందుకు చేస్తున్న కుట్రను వచ్చే నెల 9వ తేదీన జరగనున్న కార్మికసంఘాల బంద్ జయప్రదం చేయటం ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు వేగి వెంకటేశ్వరరావు, పతకమూడి నాగేశ్వరరావు, దంతాల వెంకటేశ్వరరావు, ఎన్.అంజమ్మ, జి.ధనలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

మహారాజశ్రీ కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం.23/2023

పిటీషన్ :
వల్లమన్నాటి నవీన్ .... వాది
మరియు
రాగిపాటి సుబ్రహ్మణ్యం .... ప్రతివాది

టు :
రాగిపాటి సుబ్రహ్మణ్యం, తండ్రి పిచ్చయ్య, హిందూ, వ్యాపారం, వయస్సు 35 సం॥ములు, నివాసము పెదపులిపాక గ్రామము, పెనమలూరు మండలం, విజయవాడ జి.సి.జి.సి.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు నుండి దావా సమన్లు ఎన్నిసార్లు పంపించిననూ మీరు దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున నదరు మీకు పై నెంబరు దావాలో దావా సమన్లు పేపరు పబ్లికేషన్ ద్వారా అమలు జరుగుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసినారు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది.02-07-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని కోర్టుకు హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా : 02-07-2025

టి.శ్రీనివాసరావు, వాది తరుపు న్యాయవాది
కైకలూరు - 521333
సెల్ : 9848022862

సూపర్ సిక్స్ వెంటనే అమలు చేయాలి

విశాలాంధ్ర-గంపలగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్.నాగుల్‌మేరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక హెచ్‌డబ్ల్యు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల సహాయ కార్యదర్శి సిద్ది. కొండలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రభుత్వం రైతులకు 20,000 వెంటనే అందజేస్తామని చెప్పి వ్యవసాయ సీజను మొదలైన కూడా రూపాయి కూడా వేయకపోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. తల్లికి వందనం నూటికి 50 మందికి కూడా అమలుకాలేదని ఆయన దుయ్యబట్టారు. 18 సంవత్సరాల నిండిన మహిళలకు నెలకు రూ.1500 అందజేస్తామన్నారని నేటికీ దాని ఊసే లేదని, రాష్ట్రాన్ని సస్య శ్యామలంగా తీర్చిదిద్దుతానని, సంపద సృష్టిస్తానని,లక్షల్లో ఉద్యోగాలు ఇస్తానని చెప్పి

నాలుగు లక్షల ఉద్యోగాలు పీకేసారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం గ్రామంలో ప్రతి ఇంటికి ఆటోల ద్వారా రేషన్ బియ్యం అందజేస్తే వాటిని తొలగించారని, దీంతో వృద్ధులు, వికలాంగులు రేషన్ బియ్యానికి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని దాటవేశారని అన్నారు. పేదలకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలాలు వెంటనే అందజేయాలని, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, ఇవి పేదలకు అందే వరకు 11 మందితో కమిటీ వేసి పోరాటం సాగిస్తామని ఆయన తెలిపారు. ఇళ్ల స్థలాలపై జీవో వచ్చిందని తిరువూరు ఆర్డీవో తెలిపారని ఆయన అన్నారు. భర్తకు పెన్షన్ వస్తు అతను మరణిస్తే గత ప్రభుత్వం నెలలో భార్యకు పింఛన్ ఇచ్చారని, ఈ ప్రభుత్వం వచ్చాక ఇవ్వడం లేదని విమర్శించారు. కట్టలేరుపై బ్రిడ్జి కూలి 8 సంవత్సరాలు దాటినా కూడా నేటికీ దానిమీద నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేదని దీనివలన విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల మీద జులై 5వ తేదీన స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తారని, దీనికి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని నాగుల మేర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కమిటీ సభ్యులు, మండల సహాయ కార్యదర్శి సిద్ది కొండలరావు, మండల కార్యదర్శి గవర్రాజు. రామకృష్ణ, ఎడ్లపల్లి. కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగ ప్రతి ఒక్కరి జీవితంలో జీవనశలిగా మార్చుకోవాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : యోగ ప్రతి ఒక్కరి జీవితంలో జీవనశలిగా మార్చుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. స్థానిక బిఆర్‌టిఎస్ రోడ్డులో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలు చేయటం జీవనశైలిగా మారి ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితంతో జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యం పట్ల బాధ్యత వహించాలని, ఆరోగ్యంగా ఉంటేనే జీవితం ఆనందంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన డిప్లమా ప్రాక్టికల్ పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో మూడు రోజులుగా కూచిపూడి నాట్యంలో జరుగుతున్న సర్టిఫికెట్, డిప్లమోకోర్సులప్రాక్టికల్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. డిప్లమోకోర్స్ పరీక్షలకు 21 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరైనారు. పరీక్షలకు అధికారిగా సుధీర్‌రావు (వరంగల్) వ్యవహరించగా ఈ పరీక్షలకు చీఫ్ సూపరెండెంట్ గా కొనసాగుతున్న కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ నట్టువాంగం నిర్వహించారు. టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి మృదంగంపై ఈ పరీక్షలకు సహకరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నగరంలోని మూడు జోనల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గన్నవరం నియోజకవర్గంలో నిరంతరం విద్యుత్

విశాలాంధ్ర-గన్నవరం : బాపులపాడు మండలం, మల్లవల్లి గ్రామంలోని హనుమాన్ జంక్షన్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో మల్లవల్లి పారిశ్రామిక కారిడార్ లో నిరంతర విద్యుత్ సరఫరాలో భాగంగా రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా విద్యుత్ లైన్ల ఆధునీకరణ మరియు నిరంతర 3-ఫేస్ విద్యుత్ లైన్ల నిర్మాణ పనులను ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు, యార్లగడ్డ వెంకట్రావు చేతులు మీదుగా శంకుస్థాపన చేసి ప్రారంభించిన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నేతలు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వరదకు ముగింపు: రాము

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని మోపర్రు, వింజరం పాడు గ్రామాలు పైనుంచి వచ్చే వర్షపు నీరు వరద రూపంలో వన్నేరు, బుడమేరు లోకి ప్రవేశించి బుడమేరు వన్నేరు గట్టులు తెగి పంట పొలాలలోకి, నివాసఇళ్లల్లోకి ప్రవేశించి ప్రతి ఏటా వరద ఉధృతకి నష్టపోవటం జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా దృష్టికి తీసుకెళ్లిన మరుక్షణమే జిల్లా కలెక్టర్ బాలాజీ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లిన విషయం, కలెక్టర్, ఎమ్మెల్యే ఆ గ్రామాన్ని సందర్శించి పరిశీలించిన విషయం పాఠకులకు విధితమే. ఈ విషయమై మోపర్రు గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రగతి పథంలో నడిపించిన హైదరాబాదులో నివాసం ఉంటున్న ఆ గ్రామ ప్రముఖులు, అడ్వకేట్, సీతంరాజు రామారావు (రాము) తన సొంత నిధులు వెచ్చించి, గ్రామస్తులు, చేపలచెరువుల యజమానులు, ఎన్నారైల సహకారంతో భవిష్యత్తులో వరద ముంపుకు ముగింపు పలికేందుకు ఆదివారం పనులు ప్రారంభించినట్లు సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూషన్ కమిటీ వైస్ చైర్మన్ ఉజ్జినేని చంద్రశేఖర రావు (బుజ్జి) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ యార్లగడ్డ రవి, దోసపాడు నీటి సంఘం అధ్యక్షుడు గుండపనేని శ్రీనివాసరావు (స్వామి), గ్రామ సర్పంచ్ జూపల్లి కమల కుమారి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, పార్లమెంటు నియోజకవర్గ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, కలపాల కిషోర్, ఉజ్జినేని అనిల్ కుమార్, జూపల్లి వెంకటరావు, బోయిన సాంబశివరావు, జూపల్లి శేఖర్ బాబు, కొమ్మ నారాయణస్వామి, కాంట్రాక్టర్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పిల్లర్లకే పరిమితమా....!

విశాలాంధ్ర-పమిడిముక్కల: గత వైసిపి హయాంలో హను మంతపురం గ్రామంలో రైతుభరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మించటకు అట్టహాసంగా హడావిడిగా భవననిర్మాణాలకు పిల్లర్లు వేసి అసంపూర్తిగా వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.దీంతో ఆ ప్రాంతమంతా పిచ్చిమొక్కలుతో చిట్టడవి లా తయారైంది.రెండు అడుగుల మేర కాంక్రీటు పిల్లర్లు వేసి వదిలేయంటతో ఇనుప చువ్వలు ఎండకు ఎండి వానకు తడిసి తుప్పు పట్టి పాడైపోతున్నాయి. నిధులు కొరత కారణంగా రెండు భవనాలు నిర్మాణపు పనులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం రైతు సేవా కేంద్రం తాత్కాలికంగా కమ్యూనిటీ హాలు లో కొనసాగిస్తున్నారు.వెల్నెస్ సెంటర్ అద్రస్సేలేదు.ఆ ప్రాంతం లో బహిర్భూమికి వెళ్ళటంతో ముక్కుమూసుకుని వెళ్ళవలసి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.అధికారులు స్పందించి భవనాలు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సాగుకు సాగేదెలా..సారూ...?

విశాలాంధ్ర, విస్సన్నపేట : విస్సన్నపేటలో కొన్ని వందల ఎకరాల రైతులకు ప్రధానంగా ఉపయోగించే రహదారి పంచాయతీ పాలకులు, అధికారుల కారణంగా అధ్వాన్న స్థితికి చేరుకుంది. సమస్య పరిష్కారం కోసం ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదని సాగుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విస్సన్నపేట రాణి కల్యాణమండపం నుంచి పెద్దఎత్తున రైతులు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు గతం నుంచి మల్లప్పకుంట రహదారిని వినియోగించుకుంటున్నారు. ఇదే మార్గంలో వ్యవసాయ భూముల మధ్యలో ఉన్న రెవిన్యూ పోరంబోకు స్థలంలో ప్రభుత్వం డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసింది. విస్సన్నపేట పంచాయతీలో పదుల సంఖ్యలో చెత్తతో కూడిన ట్రాక్టర్లు, వాహనాలు ప్రతిరోజూ ఈ మార్గంలో డంపింగ్‌యార్డుకు చెత్తను తరలిస్తున్నాయి. వాహనాల రాకపోకల కారణంగా రహదారి అధ్వాన్నంగా, మోకాలి లోతు బురదమయం కావటంతో అన్నదాతలు తమ పంట భూములకు వెళ్లేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఇటు రైతులు, అటు పంచాయతీ ఉమ్మడిగా వినియోగించుకుంటున్న రహదారిని రాకపోకలకు అనువుగా మార్చాలని పలుమార్లు అధికారులను వేడుకున్నా, ఫలితం దక్కటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొలంలోకి కాలిబాటన చేరుకునేందుకు సైతం ఆస్కారం లేని దుస్థితి కలగటంతో తాము తాజాగా అధికారులను కలిసి, సమస్య విన్నవించుకునే ప్రయత్నం చేయగా, దురుసు సమాధానాలు ఎదురైనట్లు పలువురు రైతులు వాపోతూ, సమస్య పరిష్కారానికై వేడుకుంటున్నారు.

మొవ్వ మండలంలో 8,462 పింఛన్ల పంపిణీ సిద్ధం

విశాలాంధ్ర-కూచిపూడి : జులై 1వ తేదీన మొవ్వమండలంలో 8,462 పెన్షన్లు పంపిణీకి రూ.3,63,39,500ను ప్రభుత్వం కేటాయించినట్లు ఎంపీడీవో డి సుభాషిణి పేర్కొన్నారు. ఈ పెన్షన్ల సొమ్మును సోమవారం ఆయా సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఆయా బ్యాంకు నుంచి డ్రా చేసి పంపిణీ సిబ్బందికి అందజేస్తారు.

వారాహి దేవి వేడుకలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: కూడేరులో కావూరి వారి ఇలవేల్పు శ్రీ ఆదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారు "వారాహి దేవి" కి నవరాత్రులు వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ఆదివారం పలు గ్రామాల మహిళలు కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలీనగిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: అలీనగిపాలెంలో గద్దీర్ సొసైటీ ఆధ్వర్యంలో పామర్రు కి చెందిన ఎస్ 2 వైద్యశాల వైద్యులు డాక్టర్ శివయ్య సింగం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 120 మందికి బి.పి. షుగర్, ఇ.సి.జి. ఇతర పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణి, అంజాద్ అలి షిఫాయత్ అలి హుస్సేన్ అలి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది కొరత.. అభద్రతాభావంలో ప్రజలు

విశాలాంధ్ర-కారంపూడి: సమస్యాత్మక గ్రామాలు ఉన్న మండలం కారంపూడి. ఇటువంటి మండలంలో పోలీస్ సిబ్బంది కొరత వలన ప్రజలలో అభద్రత భావం కలుగుతుంది. చరిత్రపరంగా ఫ్యాక్షన్, భూతగాదాలు, సామాజిక అసమానతలు వంటి సమస్యలతో గుర్తించిన ప్రాంతం ఇది. ఇటువంటి మండలానికి సిబ్బందిని కేటాయించడంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఉదాసీనత వ్యవహరిస్తున్నారు. సాధారణంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఏఎస్‌ఐలు-3, హెడ్‌కానిస్టేబుల్స్ 6గురు, కానిస్టేబుల్స్ 18 మంది మొత్తంగా 27 మంది ఉండవలసి ఉండగా కారంపూడి పోలీస్ స్టేషన్‌లో 11 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది తక్కువగా

ఉండటం వలన రాత్రిపూట పెట్రోలింగ్ పూర్తిగా గాడి తప్పుతుంది. దీనివలన దొంగతనాలు, ఫ్యాక్షన్ ఘర్షణలు, మద్యం లావాదేవిలు ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. గ్రామాలలో ఘర్షణ వాతావరణం తలెత్తినప్పుడు పోలీసులు తక్షణమే రాకపోతే ప్రజలలో పోలీసులపై విశ్వాసం తగ్గిపోతుంది. దీనివలన ఆత్మరక్షణ పేరుతో బాధితులే స్వయంగా చర్యలకు దిగే పరిస్థితికి దారితీస్తుంది. సిబ్బంది లేకపోవడం వలన మహిళల రక్షణ బలహీనమవుతుంది. గ్రామాలలో పాఠశాలకు వెళ్లే బాలికలపై వేధింపులు, రాత్రిపూట భద్రతా లోపాలు పెరిగే అవకాశం ఉంది. సిబ్బంది కొరత వలన ట్రాఫిక్ నియంత్రణ కోల్పోతుంది. విధులలో ఉన్న సిబ్బందికి అధిక పనిభారం పెరిగి శారీరకంగా, మానసికంగా క్షీణించే అవకాశం ఉంది. విధులలో తీసుకునే నిర్ణయాలలో లోపాలు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రజల జీవితం సాఫీగా సాగాలంటే రక్షణ వ్యవస్థను బలపరచడం అత్యవసరం. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పోలీసు సిబ్బందిని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి గ్రామానికి నీరందిస్తాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకాకాని : మండలంలోని నంబూరు గ్రామ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో రూ.50 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో వాటర్ ట్యాంక్‌కు ఆదివారం పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, మంచినీటి వసతి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-మంగళగిరి : నవులూరు గోలివారితోట, రైల్వే గేట్ సమీపంలో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్మైల్ ఓల్డేజ్ హోమ్‌లో పట్టణ టీడీపీ మాజీ కార్యదర్శి స్వర్గీయ గోవాడ హనుమంతరావు వర్ధంతిని పురస్కరించుకొని గోవాడ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హాజరైన టీడీపీ నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ గోవాడ హనుమంతరావు ఆనాడు పార్టీ పట్టణ కార్యదర్శిగా పార్టీ అభివృద్ధికి, శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా దేవాలయం అభివృద్ధికి చేసిన కృషి మరువరానిదన్నారు. టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు పద్మశాలియ సాధికారిక సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ, టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, సింహాద్రి రామారావు, చింతా వెంకటేశ్వరరావు, రుద్రు మురళీకృష్ణ, దామర్ల మోహన్, హోమ్ నిర్వాహకురాలు కాగితాల స్వాతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం టీడీపీ నాయకులు బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలో గోలి చైతన్యకు రూ45 వేల చెక్కును, మాదల నవదీప్‌కు రూ.65,800 విలువైన చెక్కును, రామినేని ప్రేమలత రూ.42,292 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మొత్తం ముగ్గురికి రూ.1,53,092ల విలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు రావడానికి కృషిచేసిన మంత్రి నారా లోకేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, మంగళగిరి రూరల్ మండల అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, రైతు నాయకులు గాదె పిచ్చిరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్, గుడిమెట్ల మరియదాస్, కొడవలి ఆనంద్, మొద్దుకూరి రమేష్ బాబు, కంచర్ల బద్రి, షేక్ బాజీ వలి, కంచర్ల బుల్లబ్బాయి, బొర్రా శ్రీకాంత్, వెలగపూడి బ్రహ్మం, షేక్ బాజీ(నేపాల్), కొప్పాక ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని రైతులను అన్ని విధాల ఆదుకోవాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులను అన్ని విధా ఆదుకోవాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్లతో పాటు వసతులు, సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి పేరును పార్లమెంటులో చర్చించి గెజిట్ నోటిఫికేషన్ ప్రకటించి రాష్ట్రపతి చేత ఆమోదింపచేయాలని జలీల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. 2027లో జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సుమాలోచన చేస్తుందని, ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి రాబట్టి వేగంగా అభివృద్ధి చేయాలని జలీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్య, వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జలీల్ విజ్ఞప్తి చేశారు.

బీవీ రావుకు అంబటి పరామర్శ

విశాలాంధ్ర-తాడేపల్లి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై హాస్పటల్లో చికిత్స తీసుకొని ఇంటికి వచ్చిన జనసేన పార్టీ కార్యకర్త బత్తుల వెంకటేశ్వరరావు(బీవీ రావు)ను ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు ఇతర నాయ కులు, కార్యకర్తలు తాడేపల్లి సలాం సెంటర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బీవీ రావు ఆరోగ్య పరిస్థితిని అంబటి తిరుపతిరావు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. బీవీ రావును కలిసిన వారిలో ఎంటీఎంసీ కార్యదర్శి మేకా నాని, తాడేపల్లి పట్టణ 19 అధ్యక్షులు కాశిమాల దినేష్ చక్రవర్తి, ఉపాధ్యక్షులు వీరిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి కిలారి శ్రీను, పండు, అల్లం నాగమల్లేశ్వరరావు, సీతానగరం జనసేన నాయకులు బొల్లు నానాజీ, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, సలాం సెంటర్ జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేటి నిరసన కార్యక్రమానికి తరలిరండి

విశాలాంధ్ర-పెదనందిపాడు : పెదనందిపాడు, కాకుమాను మండల కేంద్రాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సోమవారం ఉదయం 10 గంటలకు పెదనందిపాడు పాతబస్టాండ్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి రైతులు తరలిరావచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు ఆదివారం గ్రామాలలో పర్యటించి రైతులకు విజ్ఞప్తిచేశారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, పోపూరి సుధీర్, శొఖమూరి రంగనాయకులు, మదమంచి అప్పారావు తదితరులు ఉన్నారు.

సీఓసీఎం డైరెక్టర్ ఆధ్వర్యంలో బుక్స్ అందజేసిన డాక్టర్ మునిరాజు

విశాలాంధ్ర-గుంటూరు

వైద్యం : స్థానిక ముత్యాలరెడ్డి నగర్ 5వ లైనులో ఉన్న క్రైస్ట్ అర్ఫన్ సెంటర్ మినిస్ట్రీస్ (సీఓసీఎం) డైరెక్టర్ మెరుగుమోలు స్టీఫెన్ సుందర్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచిత నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.మునిరాజు స్టీఫెన్ సుందర్‌తో కలిసి పేద పిల్లలకు బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మునిరాజు మాట్లాడుతూ సీఓసీఎం డైరెక్టర్ మెరుగుమోలు స్టీఫెన్ సుందర్ కల్పించిన ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డాక్టర్ మునిరాజు పిల్లలకు తెలియజేశారు. మరో ముఖ్య అతిథి ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లీగల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధాకర్ బాబు మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకుని అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. స్టీఫెన్ సుందర్‌ను మీరంతా ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చేస్తున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా గుంటూరు జిల్లా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా 'ఉత్తమ సేవా' పురస్కారాన్ని పొందారన్నారు. ఆయన లాగే మీరు కూడా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఓసీఎం సంస్థ కోశాధికారి కురగంటి సువర్ణ కుమారి, సెక్రటరీ బొద్దు బ్లాండినమ్మ, సంస్థ సభ్యులు రమావత్ హనుమా నాయక్, మెరుగుమోలు సొలొమాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వాణిశ్రీ లక్ష్మీకి అభినందనలు

విశాలాంధ్ర-మంగళగిరి : పాత మంగళగిరి భద్రావతి నగర్‌లో ఉజ్బెకిస్తాన్ దేశంలో బుఖారా యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్ స్పెషాలిటీ జనరల్ మెడిసిన్ పూర్తి చేసుకుని ఇటీవల స్వస్థలం చేరుకున్న పద్మశాలి సామాజిక(బీసీ) వర్గానికి చెందిన డాక్టర్ పూట్ల వాణిశ్రీ లక్ష్మిని ఆదివారం పలువురు పద్మశాలియ ప్రముఖులు, టీడీపీ బీసీ నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాణిశ్రీ లక్ష్మి జన్మదినోత్సవం కూడా కావడంతో వారు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. డాక్టర్ వాణిశ్రీ లక్ష్మి తండ్రి పూట్ల వెంకట సాంబశివరావు స్థానికంగా పద్మశాలియ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, చేనేత వస్త్ర వ్యాపారంలో మంచి గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెంట్ పద్మశాలియ సాధికారిక సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ మాట్లాడారు. డాక్టర్ వాణిశ్రీ లక్ష్మి విదేశాలలో వైద్య విద్య పూర్తి చేసుకోవడం పద్మశాలీలకు గర్వంగా ఉందన్నారు. వైద్యురాలిగా పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించి తల్లిదండ్రులకు, పద్మశాలియ సామాజిక వర్గంకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు, ఉపాధ్యక్షులు రుద్రు మురళీకృష్ణ, టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, సింహాద్రి రామారావు, దామర్ల మోహన్ తదితరులు డాక్టర్ వాణిశ్రీ లక్ష్మిని కలిసి అభినందించి, శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

అమరావతి రథయాత్రలో పాల్గొన్న గోనుగుంట్ల లీలావతి

విశాలాంధ్ర - వినుకొండ : విజయవాడ ఇస్కాన్ ఆధ్వర్యంలో అమరావతి రథయాత్ర మహోత్సవ కార్యక్రమం ఆదివారం భవానిపురం సీతానగరంలో వైభవంగా జరిగింది. జగన్నాథ రథయాత్ర భక్తి పారవశంతో సాగగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి పాల్గొన్నారు. సితార కూడలి నుంచి సీతమ్మ వారి పాదాల సెంటర్ వరకు మహిళా భక్తులతో యాత్రలో పాల్గొని కొలువుతీరిన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవత మూర్తులకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

విశాలాంధ్ర- దాచేపల్లి : నారాయణపురంలోని విభిన్న ప్రతిభావం తుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ఎయిర్ టెల్ బుజ్జి అన్నదానం చేశారు. అమరా అప్పారావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మీడియా మిత్రులు, ఆర్య వైశ్య సోదరులు పాల్గొన్నారు.

కేసానపల్లిలో వైసీపీ నేతల పర్యటన

విశాలాంధ్ర-దాచేపల్లి : గ్రామీణ మండలంలోని కేసానపల్లిలో ఆదివారం జరిగిన ఓ వివాహ వేడుకలకు వైసీపీ నేతలు హాజరయ్యారు. వారిలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

గుండె పోటుతో వీఆర్వో మృతి

విశాలాంధ్ర-దుర్గి: గ్రామానికి చెందిన అందుగుల రాజారావు (62) మాచర్ల అర్బన్ నెహ్రూనగర్ 3వార్డు వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆదివారం స్వగ్రామం దుర్గిలో గుండె పోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయనకు భార్య సాలమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలరు. ఆయన ఆకాల మరణాన్ని చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ జిల్లా గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం తరుపున వారికి నివాళులు అర్పించారు.

లింకు రోడ్డు బ్రిడ్జి పనులు పూర్తి

విశాలాంధ్ర-పెదకూరపాడు : కంభంపాడు నుంచి జలాలపురం వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డులో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ లింకు రోడ్డు ద్వారా గుంటూరు వెళ్లేందుకు సమయం ఆదా అవుతుందని వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని ఈ బ్రిడ్జి రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చినందుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

మానవత్వానికి ప్రతీకగా మానవత స్వచ్ఛంధ సంస్థ: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మానత్వానికి ప్రతీకగా మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ నిలిచిందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గత మూడు సంవత్సరాలుగా గుంటూరులో బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని కొనియాడారు. మానవత 3వ వార్షికోత్సవ వేడుకలు గుంటూరులోని బాలాజీ కళ్యాణ మండపం నందు ఆదివారం ఉదయం జరిగాయి. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మానవ సంబంధాల విశిష్టతను తెలిపే రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన కవితను చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుంటూరు నగరంలో 5 లక్షల మొక్కలను నాటి హరిత గుంటూరుగా మార్చాలనే సంకల్పంలో మానవత భాగస్వామ్యం కావాలని కోరారు. మానవత లాంటి స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని గుంటూరు నగరాన్ని పరిశుభ్రమైన, సుందరమైన నగరంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తామన్నారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ 2004లో 108 మంది సభ్యులతో ప్రారంభమైన మానవత నేడు 132 శాఖలకు విస్తరించి, 80 వేల సభ్యులతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం గొప్ప పరిణామమన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 1990వ దశాబ్దంలో అక్షరాస్యత ఉద్యమంలో ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు సమిష్టిగా కృషి చేయడం వలన ఆ దశాబ్దంలో 17 శాతం అక్షరాస్యత పెరిగిందని, నేడు ఈ ప్రయోగాన్ని పునరావృతం చేసి అక్షరాస్యతలో 32వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అక్షరాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, తెనాలి, పొన్నూరు, బాపట్లలో మానవత శాఖలు ఏర్పడి పని చేస్తున్నాయని, త్వరలో మరో 5 పట్టణాలలో మానవత శాఖలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సర్వసభ్య సమావేశం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుందని, అధ్యక్షునిగా డాక్టర్ కోట శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా డాక్టర్ పి.కల్పన, కార్యదర్శిగా కె.సతీష్ బాబు, కోశాధికారిగా టీ.వి. సాయిరాం, సంయుక్త కార్యదర్శిగా కర్నాటి ఆనంద్‌లను ఎన్నుకొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కొమ్మలపాటి శ్రీనివాసరావు, టి. ధనుంజయరెడ్డి, డాక్టర్ ఎన్.అరవింద్, టి.సుందర రామయ్య, డైరెక్టర్లు ఉప్పల సాంబశివరావు, బిఎన్. మిత్ర, ఎన్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని వామపక్ష సీనియర్ నాయకులు బి.ఆంజనేయరెడ్డి అన్నారు. మండలంలో అన్నవరం గ్రామంలో ఆదివారం ఇరాన్‌పై అమెరికా దాడిని నిరసిస్తూ ప్రజాసదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ అమెరికా ఇరాన్ పై యుద్ధం చేయడం వలన ఆయా దేశాల్లో ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని అన్నారు. ఈ విధంగా అమెరికా అండతో పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడి చేసి గాజా ను నేలమట్టం చేయడం వలన 60వేల మంది అమాయక ప్రజలు చనిపోయారని అన్నారు. లక్షలాదిమందికి గాయాలు అయ్యాయని అన్నారు. అదే విధంగా ఇరాన్ పై ఇజ్రాయిల్ దాడి చేయడం వలన ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని అన్నారు. యుద్ధ దాహంతో రగిలిపోతున్న అమెరికాకు భారతదేశం ఎటువంటి మినహాయింపు కాదని అన్నారు. అమెరికా యుద్ధోన్మాదాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వలన రైతులు, పేద ప్రజలు బలైపోతున్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక మద్దతు ధర కోసం రైతాంగం అనేక పోరాటాలు చేసిన ప్రభుత్వాలలో చలనం లేదని అన్నారు. దీనిపై రైతులు గ్రామస్థాయిలో చర్చించి చైతన్యం నింపుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కామేపల్లి కాల్వ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : ఆకురాజుపల్లి మేజర్ పరిధిలోని కామేపల్లి సాగునీటి సంఘం-37 మైనర్ కాలువల ఆధునీకరణ పనులు ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో డీసీ 05 చైర్మెన్ పిడుగురాళ్ల మండల తెదేపా కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు , ఇఇ రమేష్, డిఇ ఆదినారాయణ, కామేపల్లి ప్రెసిడెంట్ రొండి శివయ్య, టీసీ బడిగుంచాల చౌడయ్య, గోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ కోరముట్ల ఆంజనేయులు మరియు గ్రామ తెలుగుదేశం నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కామేపల్లి మైనర్ కాల్వ ఆదునీకరణ పనులు సకాలంలో పూర్తి చేసి రాబోయే వ్యవసాయ సీజన్లో రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తామని సాగునీటి సంఘ నాయకులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-పొన్నూరు : పీబీఎన్ కళాశాలలో 1979-82 బీకాం చదువుకున్న పూర్వ విద్యార్థుల ద్వితీయ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామంలో మదమంచి సుబ్బారావు ఇంటి వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమ తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సుమారు 43 ఏళ్ల తర్వాత గత సంవత్సరం ప్రారంభమైన ఈ సమ్మేళనం కొనసాగింపుగా ఈ ఆదివారం అందరూ కలిసి ఉత్సాహంగా సరదాగా ఒకరికొకరు వారి ఈ 40 ఏళ్ల ప్రస్థానంలో వారు సాధించిన పురోగతి పంచుకోవడంతో పాటు చదువుకున్న సమయంలో వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఇదేవిధంగా అందరూ ఒకరికొకరు సహకరించుకోవటంతో పాటు సమాజసేవకు తమ వంతు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విధంగా కలుసుకోవటం ఎంతో ఆనందాన్ని కలిగించిందని దీన్ని కొనసాగించుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా వల్లభరావుపాలెంకు చెందిన మదమంచి సుబ్బారావు దంపతులు 108 పుణ్యక్షేత్రాలను సందర్శించిన సందర్భంగా దంపతులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీబీఎన్ కళాశాల 1979-82 బీకాం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కొసనం రామ్మోహన్ రావు, కార్యదర్శి కొళ్ళపూడి కిషోర్, ట్రెజరర్ వై.శివరామకృష్ణ, సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన శుభాంశు శుక్లా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నాలుగు దశాబ్దాల తరువాత మరొక భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలో అడుగుపెట్టడం దేశానికి గర్వకారణమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి హర్షం వ్యక్తంచేశారు. కార్యాలయంలో శుభాంశు శుక్లాను అభినందిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికి నాలుగు వందల కిలో మీటర్ల దూరంలో ఉన్న అంతరిక్ష పరిశోధనా కేంద్రంలో మువ్వన్నెల పతాకాన్ని ప్రదర్శించటం భారతీయులందరికీ సంతోషకరమైన అనుభూతి అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల నుంచి వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్ళటం, రావటం ఇటీవల కాలంలో సర్వసాధారణ విషయమే అయినప్పటికీ 1984లో రాకేష్ శర్మ తరువాత మరొక భారతీయ పౌరుడు రోదసీ యాత్ర చేయడం ఇదే మొదటిసారి అని అన్నారు. విశ్లేషకులు వివిఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు దేశాల అంతరిక్ష పరిశోధనా కేంద్రాలు సంయుక్తంగా తలపెట్టిన ఈ అంతరిక్ష అధ్యయన యాత్ర మానవాళి వైజ్ఞానిక పదంలో మరొక ముందడుగు అన్నారు. కవి జమదగ్ని, మురళీకృష్ణ, ఇంజనీర్ సదాశివంలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-మంగళగిరి : ఉచిత వైద్య శిబిరాలను ఆరోగ్య పరిరక్షణకై ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డివిఎస్ రాజు నాయుడు అన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువులోని కళ్యాణ మండపంలో ప్రముఖ వైద్య నిపుణులు ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మనిషి ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరోనా సమయంలో వైద్యం కోసం ప్రజల పడిన ఇబ్బందులను ఆయన గుర్తు చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య వేదిక మంగళగిరి రీజియన్ ఆధ్వర్యంలో అనేక సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పేద ప్రజలకు వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా పోరాటం చేసి మంగళగిరిలో 100 పడకల ఆసుపత్రిని సాధించుకోవడం జరిగిందని అన్నారు. వైద్య శిబిరంలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డివిఎస్ రాజు నాయుడు బృందం ఆధ్వర్యంలో స్త్రీలకు ప్రత్యేకంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కెవిఎస్ సాయి ప్రసాద్, ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ పి గిరిజ, దంత వైద్యులు డాక్టర్ ఎం వంశీకృష్ణ, జనరల్ వ్యాధి నిపుణులు డాక్టర్ లక్ష్మీ ప్రియాంక, శర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ గీష్మ, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ పి వంశీకృష్ణ, దంత వైద్య నిపుణులు డాక్టర్ వి. సింధూర, డాక్టర్ హేమంత్ మాకినేని, డాక్టర్ ఎం హిమని, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి అనూష, తదితరులు పాల్గొని ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

నేడు జంజనం నిరాహార దీక్ష

విశాలాంధ్ర-తాడికొండ : రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జంగనం కోటేశ్వరరావు తన స్వగ్రామం నిడుముక్కలలో సోమవారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఉదయం 10 గంటలకు తన ఇంటి వద్ద దీక్షను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అభివృద్ధి పేరుతో గత పది సంవత్సరాల క్రితం 36 వేల ఎకరాల భూమిని తీసుకొందని గుర్తుచేశారు. 29 గ్రామాలలో ఇప్పటికీ రాజధాని అభివృద్ధి జరగలేదన్నారు. తిరిగి మళ్లీ తాడికొండ, అమరావతి, పెదకూరపాడు మండలాలలో భూ సమీకరణ ద్వారా 44 వేల ఎకరాలను సేకరించేందుకు సిద్ధమైందని తెలిపారు. తీసుకున్న భూమిని అభివృద్ధి చేయకుండా మరల భూ సమీకరణ ఏమిటని నిలదీశారు. రెండో విడత భూ సమీకరణకు వెళ్లేటట్లయితే ప్రభుత్వం ఎకరాకు కోటి రూపాయలు రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే భూ సమీకరణ చేపట్టే గ్రామాలలో తెల్ల రేషన్ కార్డు ఉన్న నిరుపేదలకు నెలకు రూ.10 వేలు ఇవ్వాలన్నారు. భూ సమీకరణ వల్ల నష్టపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు. అన్ని రాజకీయ పార్టీలు తన దీక్షను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఈ నెల 30వ తేది ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఉన్నందున జీఎంసీ పార్కింగ్ దగ్గరలోని జనన మరణ నమోదు విభాగం ఎదురు మధ్యాహ్నం 1 గంట వరకు నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు.

దంతాల అందంతోనే ఆత్మవిశ్వాసం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : దంతాలు అందంగా ఉంచుకుంటేనే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. అయితే దంతాల పరిశుభ్రత విషయంలో ఎక్కువ మంది అశ్రద్ధ చేస్తుంటారని, దీంతో తెలియకుండానే అనేక వ్యాధుల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పట్టాభిపురం మెయిన్ రోడ్డులో డాక్టర్ అర్జున్ సారది సీహెచ్, డాక్టర్ దీపికల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ముకుంద మల్టి స్పెషాలిటీ డెంటల్ క్లినిక్'ను ఆదివారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని),ఎమ్మెల్యేలు గల్లా మాధవి, యరపతినేని శ్రీనివాసరావు విచ్చేసి క్లినిక్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం క్లినిక్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక దంత వైద్య పరికరాలు, ల్యాబ్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియాలు చర్మం, దంతాల ద్వారా మన శరీరంలోకి ప్రవేశించి అనేక వ్యాధులకు కారణమవుతాయన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి ఆరు నెలలకొకసారి దంతాలను శుభ్రం చేయించుకుంటారని అన్నారు.

'ముకుంద మల్టి స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ ప్రారంభోత్సవం'లో పెమ్మసాని

మనకు దంతాల పరిరక్షణ విషయంలో సరైన అవగాహన లేకపోవడం వలన అనేక వ్యాధులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. డాక్టర్ అర్జున్ సారధి, డాక్టర్ దీపికలు మీడియాతో మాట్లాడుతూ దంతాలకు సంబంధించి ఇటీవల అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య పరికరాలు తమ హాస్పటల్లో ఉన్నట్లు తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో దంతాలకు అన్ని రకాల మల్టి స్పెషాలిటీ వైద్య సేవలు అతి తక్కువకే అందిస్తారని చెప్పారు. ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చిన డెంటల్ క్లినిక్‌ను సందర్శించి తమ దంతాలను పరీక్షించుకోవాలని వారు సూచించారు. పేషంట్ల అభిరుచుల మేరకు వైద్యం చేయటం ముకుంద మల్టి స్పెషాలిటీ డెంటల్ క్లినిక్ ప్రత్యేకత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు వైద్య విభాగాల డాక్టర్లు విచ్చేసి హాస్పటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రైల్వే పోలీసులు అప్రమత్తతో ఎలాంటి నష్టం జరగలేదు: డీఎస్పీ

దొంగల ఎదురు దాడితో ఆత్మ రక్షణకు కాల్పులు

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : తుమ్మలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీకి పాల్పడిన దుండగులపై రైల్వే పోలీసులు కాల్పులు జరిపిన ఘటనపై గుంటూరు డివిజన్ జీఆర్పీ డిఎస్పీ పి.అక్కేశ్వరరావు వివరాలు వెల్లడించారు. స్థానిక రైల్వే పోలీస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిగ్నల్ టాంపరింగ్, చైన్ లాగిన దుండగులు ఎస్ -1బోగీలోకి చొరబడినట్లు తెలిపారు. ప్రక్క బోగీలోనే ఉన్న ఎస్ఐ సిబ్బంది అప్రమత్తమై టార్చ్ లైట్, విజిల్, లాటీల ద్వారా ప్రయాణికులను అప్రమత్తం చేశారు. దీంతో తమ పోలీసులను గమనించిన దొంగలు రైలు దిగి పారిపోయే క్రమంలో లొంగిపోవాలని కోరినప్పటికీ కంకర

రాళ్లతో దుండగులు పోలీసులపై ఎదురుదాడికి దిగారు. ఆత్మరక్షణలో భాగంగా డ్యూటీలో ఉన్న తెనాలి ఎస్సై వెంకటాద్రి 5 రౌండ్లు కాల్పులు జరపగా కానిస్టేబుల్ శేషయ్య 4 రౌండ్లు కాల్పులు జరిపినట్లు డిఎస్పీ వివరించారు. ప్రయాణికులు ఏం జరిగిందోనన్న ఆందోళనతో రైలు దిగడంతో కొంత గందరగోళం నెలకొని దుండగులు తప్పించుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. అయితే ఈ సంఘటనలో ఎటువంటి ఆస్తి నష్టము జరగలేదన్నారు. . ఆర్పిఎఫ్ డిఎస్పి శైలేష్ కుమార్ ఆధ్వర్యంలో జి.ఆర్.పి పోలీసులు సమన్వయంతో రైల్లో రాత్రులు చోరీలకు తావులేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఎటువంటి రైల్లో ప్రయాణించేందుకు ఆందోళన అవసరం లేదన్నారు. వేసవిలో రాష్ట్ర రహదారులకు సమీపంలో ఉన్న సింగిల్ రైల్ ట్రాక్‌లపై పొరుగు రాష్ట్రాలకు చెందిన దొంగలు వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామన్నారు. దీనిపై ఐదు బృందాలను ఏర్పాటు చేసి ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నేడు పిన్నెల్లిలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : మాచవరం మండలం పిన్నెల్లిలో సోమవారం ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ మరియు అవగాహన సదస్సు జరగనున్నట్లు పిడుగురాళ్ల ఉద్యానశాఖాధికారిణి అంజలీబాయి తెలిపారు. ఉద్యాన శాఖ మరియు వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన అధికారి ఐ. వెంకటరావు, వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎం రామమోహనరావు, డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఎం.నగేష్, ఏరియా మేనేజర్ ఎం నవీన్ హాజరవుతున్నట్లు అంజలీ బాయి తెలిపారు. ఈ కార్యక్రమంకు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు, కొత్తగా సాగు చేయబోయే రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరు అయ్యి వారి సలహాలు, సూచనలు అందించి మీ సందేహాలకు పరిష్కారం తెలుసుకోవాలని ఉద్యాన శాఖాధికారిణి అంజలీబాయి కోరారు.

మరింత పదునైన పోరాటాలకు సిద్ధమవ్వాలి

కంచర్ల కాశయ్య

విశాలాంధ్ర-తాడేపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మరింత పదునైన పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. ఆదివారం తాడేపల్లి సీపీఐ కార్యాలయం(నీలం రాజశేఖర్ రెడ్డి భవన్)లో తాడేపల్లి సెంట్రల్ శాఖ మహాసభ సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంచర్ల కాశయ్య మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని సీపీఐ పోరాటం చేసిందన్నారు. తాడేపల్లి పశువుల హాస్పటల్ వద్ద ఉన్న బకింగ్ హామ్ కెనాల్ శిధిలావస్థకు చేరుకుందని అమరావతి రాజధానిలో భాగమైన తాడేపల్లిలో ట్రాఫిక్ పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మహాసభ తీర్మానించిందని పేర్కొన్నారు. అలాగే తాడేపల్లిలో పలు ప్రాంతాలలో కొన్ని దశాబ్దాలుగా రైల్వే స్థలాలలో నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. కొండ ప్రాంతాలలో దశాబ్దాలుగా ఇళ్ల పట్టాలు లేకుండా ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. వారందరికీ ఇళ్ల పట్టాలు వెంటనే ఇవ్వాలని అన్నారు. మంత్రి నారా

లోకేష్ కొన్ని ప్రాంతాలలో ఇళ్ల పట్టాలు ఇవ్వడం అభినందనీయమని దానిని స్వాగతిస్తున్నామని అన్నారు. మిగిలిన వారికి కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. తాడేపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని డ్రైనేజీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వచ్చేది వర్షాకాలం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచకపోతే అంటువ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, వెంటనే డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కృష్ణానది పక్కనే ఉన్న కృష్ణా వాటర్ తాగడానికి నోచుకోలేని పరిస్థితి తాడేపల్లి ప్రాంత ప్రజలకు ఏర్పడడం చాలా బాధాకరమని అన్నారు. తాడేపల్లి ప్రాంతానికి కృష్ణానది నీళ్లు తాగడానికి అందించాలని సమావేశం తీర్మానించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం పేద ప్రజలకు ఇచ్చి కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. జూలై 20వ తేదీన సీపీఐ తాడేపల్లి ప్రాంత మహాసభ తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో జరుగుతుందని, 27న మంగళగిరి నియోజకవర్గ మహాసభ మంగళగిరిలో జరగబోతుందని ఆగస్టు 5,6,7 తేదీలలో సీపీఐ జిల్లా మహాసభలు గుంటూరు నగరంలో జరగబోతున్నాయని ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, అక్టోబర్ నెలలో చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మానికొండ డాంగే, టి.వెంకటయ్య, మునగాల రామారావు, షేక్ బాషా, శ్యామ్ ప్రసాద్, బి.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ తాడేపల్లి సెంట్రల్ శాఖ కార్యదర్శిగా మునగాల

సీపీఐ తాడేపల్లి సెంట్రల్ శాఖ కార్యదర్శిగా మునగాల రామారావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సభ్యులుగా కర్రి వెంకటేశ్వరరావు, కర్రి సురేష్, మానికొండ భాస్కర్, మునగాల వెంకట మణికంత, బాబు, రాజును ఎన్నుకున్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు మీర్ నూర్జహాన్, W/o ఇక్బాల్ హుస్సేన్, R/o డోర్ నెం.4-28, రాణా హుస్సేన్ బజార్, వినుకొండ టౌన్, పల్నాడు జిల్లా అను వారి నుండి తగు సమాచారం పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు వినుకొండ గ్రామ సర్వే నం.390/1A1 నందు 75.0 చదరపు గజముల RCC డాబా ఇంటి యొక్క లింక్ దస్తావేజు వినుకొండ సబ్-రిజిస్ట్రార్ నం. 1935/1970 తేది.20-11-1970న శావల్యాపురం రైల్వే స్టేషన్ దారిలో గల వారి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చు క్రమములో శావల్యాపురం బస్‌స్టాప్ వద్ద పద్ద ది.16-06-2025న పోగొట్టుకోవడమైనది. నా క్లయింటు సదరు దస్తావేజును ఎంత వెతికినను దొరికియుండలేదు, నా క్లయింటు ఏదైనా బ్యాంకు నుండి లోన్ పొందుటకు సదరు పై చెప్పిన దస్తావేజు అవసరం అయినదిపున్నది. కావున ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పై చెప్పబడిన విక్రయ దస్తావేజు నం. 1935/1970 తేది. 20-11-1970 ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు సంప్రదించి ఇవ్వవలసిందిగా కోరడమైనది.

సయ్యద్ మహమ్మద్ ఖాసీమ్
అడ్వకేట్, కొత్తపేట, వినుకొండ.
సెల్ : 9030214799

మహా టీవీ కార్యాలయంపై దాడి అవమానకరం

విశాలాంధ్ర-రెంటచింతల : పత్రికా స్వేచ్ఛను అణచివేయడానికి బీఆర్ఎస్ దాదులకు దిగిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని రెంటచింతల మండల సీపీఐ కార్యదర్శి కేతావత్ రంగనాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ స్వతంత్రంగా పనిచేస్తున్న మహా టీవీ మీడియా కార్యాలయంపై జరిగిన ఈ దాడి ప్రజా స్వామ్యానికి మచ్చ తెచ్చే చర్యగా చూస్తున్నామని, మీడియా సంస్థలపై దాడులు చేయడం అనేది ప్రజాస్వామ్యానికే అవమానం అని, ఇది ఒక్క మహా టీవీ సంస్థపై కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి అని పరిగణించాలని అన్నారు. ఇటువంటి దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలన్నది మా డిమాండ్ ఇటువంటి చర్యలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నామని తెలిపారు.

తోట సావిత్రికి సీపీఐ నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : పట్టణంలోని ద్వారకా నగర్‌కు చెందిన సీపీఐ సీనియర్ నాయకులు, నాలుగో వార్డు శాఖ సభ్యులు తోట శివనాగేశ్వరరావు సతీమణి తోట సావిత్రి దశదినకర్మకు హాజరైన సీపీఐ నాయకులు ఆమెకు పూలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, నాలుగో వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, పేరుబోయిన ముక్కంటి, బాపనపల్లి శ్రీనివాసరావు, శాఖ సీపీఐ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు: జంగాల

+ సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : దేశంలోని పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజలపై పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి భారాలో మోపిన మోదీ సర్కార్ నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ భారాలను సైతం మోపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు హనుమాన్ నగర్ 29వ డివిజన్ సీపీఐ శాఖ 6వ మహాసభ ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాఖ కమిటీ అధ్యక్షులు బాషా అధ్యక్షతన జరిగిన మహాసభలో జంగాల మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయకపోవడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దేశ సంపదను తన కార్పొరేట్ మిత్రులైనా అంబానీ, అదానీలకు అప్పగిస్తుందని ఆరోపించారు. 'కగార్ ఆపరేషన్' పేరుతో మావోయిస్టులపై ఎన్‌కౌంటర్ల ముసుగులో దాడులు చేస్తూ, అడవుల్లో ఉన్న ఖనిజాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు అమిత్ షా కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పేరిట అదానీ ఖాతాలో డబ్బులు చేరేలా ప్రజలపై విద్యుత్ బిల్లుల భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల పేరుతో అధికారంలోకి వచ్చినా ఒక్క తల్లికి వందనం తప్పా పూర్తిస్థాయిలో ఏ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. తక్షణమే హామీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక భూ పోరాటాల ద్వారా పేదల కోసం కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. హనుమాన్ నగర్, శ్రీనివాస్ నగర్, ప్రగతి నగర్, చంద్ర రాజేశ్వరరావు నగర్ వంటి పలు కాలనీలు భూ ఉద్యమాల ఫలితంగా ఏర్పడినవేనని చెప్పారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే సీపీఐ మహాసభలను విజయవంతం చేయడానికి శాఖ స్థాయి మహాసభలు నిర్వహిస్తున్నామని, ఈ మహాసభల అనంతరం నగర, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జులై 24న గుంటూరులోని శారదా కాలనీలో నగర మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర సమస్యల పరిష్కారానికి సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బి.వెంకటేశ్వర్ రెడ్డిని కొత్త శాఖ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆరుగురు శాఖ కమిటీ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ డివిజన్ కార్యదర్శి భట్టగిరి శ్రీను రెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. మహాసభలో నగర కార్యవర్గ సభ్యులు అకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి, సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో ప్రజలు భాగస్వాములు కావాలి: వలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విద్యుత్ ఛార్జీల పెంపుదలకు నిరసనగా జులై 5న జరిగే ధర్నాలో ప్రజలంతా భాగస్వాములు కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ వలి పిలుపునిచ్చారు. ఈ మేరకు గుంటూరు శ్రీనగర్‌లో ఆదివారం ప్రచార ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల రద్దు, ఛార్జీల తగ్గింపే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు. గతంలో పాదయాత్ర సమయంలో రైతులకు ఉరి తాళ్లు ఈ స్మార్ట్ మీటర్లు, స్మార్ట్ మీటర్లు పగల గొట్టండి అంటూ నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తరువాత అదే స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రజలను మోసం చేసి అదానీకి ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు, ఆనాడు జగన్ అదానీతో పెట్టుకున్న సెకీ ఒప్పందాన్ని వ్యతిరేకించిన మీరు ఇప్పుడు ఎందుకు సెకీ ఒప్పందాన్ని రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల అమలును వెంటనే నిలిపివేయాలని, ఇప్పటికే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఆధారమైన ఎలక్ట్రిసిటీ సేవను వ్యాపార మోడల్‌లోకి మార్చడాన్ని ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా అభివర్ణించారు. విద్యుత్ చార్జీల పెంపు అంశంపై సీపీఐ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట ప్రజలు భారీగా పాల్గొని తమ ఆగ్రహాన్ని వ్యక్తపరచాలని పిలుపునిచ్చారు. నగరంలోని లిబర్టీ సినిమా హాల్ సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెహ్మాన్, ఇస్మాయిల్, జిలానీ, ఖాదర్, అల్లాభక్షు పాల్గొన్నారు.

గీత కులాల అభివృద్ధికి గౌడ మహాజన సంఘం కృషి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గీత కులాల ప్రజల విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి గౌడ మహాజన సంఘం ఏర్పాటు ద్వారా కృషి చేస్తామని సంఘ నాయకులు, విశ్రాంత డీఎస్పీ ఈడె అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక నెహ్రూనగర్ లోని ఓ కళ్యాణ మండపంలో రాష్ట్ర గౌడ మహాజన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గీత కులాల అభివృద్ధికి గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత పేర్లతో ఉన్న ఐదు గీత కులాలను ఏకతాటిపైకి తెచ్చి భవిష్యత్‌లో తగిన కార్యాచరణతో ముందుకు వెళతామన్నారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ సంఘ నిర్మాణం కోసం సమాశంలో తీర్మానాలు చేసినట్లు చెప్పారు. గీతకులాలు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలవబడుతూ ఆర్థికంగా, సామాజిక, రాజకీయంగా వెనుకబడి ఉన్నామని చెప్పారు. గౌడ సామాజిక తరగతికి చెందిన ప్రజా ప్రతినిధులు, పెద్దల సహకారంతో ప్రజల అభివృద్ధికి తగిన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. గౌడ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను వాటి పరిష్కార మార్గాలు, అలాగే గౌడ సామాజిక వర్గానికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయంపై సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన నాయకులు చాలపాటి వెంకటేశ్వర్‌రావు, పరసా రంగనాథ్ తులసీరామ్, డి.కుమారస్వామి, ఎల్.అప్పారావు, శ్రీసైన, జి.బాబి, గోపాల్ ఈడిగ, పట్టా రాంబాబు, రావుల మని, కె.వంశీ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో జనరల్ హెల్త్ చెకప్‌లు అవసరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వృద్ధాప్యం వచ్చిన తరువాత శారీరకంగా, మానసికంగా వివిధ మార్పులు కలుగుతాయని, ప్రతి మార్పుకి దిగులు, ఆందోళన చెందకుండా డాక్టర్ల సలహాతో రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు చేయించుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రావెళ్ళ శ్రీగీత సూచించారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం '60 తరువాత ఆరోగ్యం' అన్న అంశంపై ఆరోగ్య సభ సంస్థ సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయస్సు 40 దాటిన దగ్గర నుంచి శరీరం వృద్ధాప్యం బాటపడుతుందని గుర్తించాలని, అది అర్థం చేసుకుని అప్పటి నుంచి ఆరోగ్యం గురించి కాస్త జాగ్రత్తపడితే వృద్ధాప్యపు ఛాయలు అంత త్వరగా దరి చేరకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. 60 నుంచి 70 దాటిన వాళ్ళల్లో దగ్గు,

నడుంనొప్పి, కీళ్ళ నొప్పులు, ఎక్కువసార్లు మూత్రం అవ్వటం, అలసట సాధారణ లక్షణాలని పేర్కొన్నారు. పెద్ద వయసులో ఇవి సాధారణమే అయినా లోలోన దాగి ఉన్న పెద్ద జబ్బులకి ఇవి సంకేతాలు కావచ్చని, అందుకనే 60 దాటిన తరువాత హెల్త్ చెకప్‌లు చేయించుకోవటం ఎంతైనా అవసరమన్నారు. పౌష్టికాహారం, శారీరక వ్యాయామం, తగిన విటమిన్లు, ఖనిజ లవణాలు తీసుకోవటం, మానసిక ఒత్తిడిని అధిగమించటం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం జరిగితే వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. 60 దాటిన తరువాత ఫిజికల్ స్టామినా,

డాక్టర్ శ్రీగీత

మెంటల్ ఎబిలిటీ బాగా ఉన్నా నిర్లక్ష్యంతో ఉండకుండా డాక్టర్లను సంప్రదిస్తూ ఉండాలని కోరారు. వినికిడి లోపం, మతిమరుపు, డిప్రెషన్, దంత సమస్యలు, మలబద్ధకం, బరువు తగ్గిపోవటం లాంటివి వృద్ధాప్యంలో సహజంగా వస్తుంటాయని పేర్కొన్నారు. వీటికి డాక్టర్లను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వృద్ధాప్యంలో వ్యాయామం పరమౌషధమని, నడక, సైక్లింగ్, యోగా, గార్డెనింగ్, ఈత తదితరాలు వీలును బట్టి చేయాలని, వ్యాయామం వల్ల రక్త ప్రసరణ, శ్వాస కోశాల పని తీరు పెరుగుతాయని అన్నారు. మానసిక ఒత్తిడి తొలగుతుందని, ఇమ్యూనిటీ పెరుగుతుందని, జీర్ణశక్తి బాగుంటుందని పేర్కొన్నారు. ఎముకలు పటిష్టంగా మారుతాయన్నారు. డాక్టర్ రవీంద్ర కుమార్, డాక్టర్ ఆర్.రామ చంద్రరావు, ఏవీ రామారావులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు కృష్ణాజిల్లాలో
దిగువ పేర్కొన్న మండలాల్లో పనిచేయుటకు
విలేకరులు కావలెను

ఇంటర్మీడియట్ చదివి తెలుగు భాషా పరిజ్ఞానం కలిగి సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న అభ్యర్థులు అర్హులు

పనిచేయవలసిన మండలాలు :
మచిలీపట్నం టౌన్, బాపులపాడు, గూడూరు, నాగాయలంక, నందివాడ, తోట్లవల్లూరు, ఉంగుటూరు, హనుమాన్ జంక్షన్

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ : 8074662146, 9490338489

గమనిక : ఆయా ప్రదేశాలల్లో స్థానికులై ఉండాలి

విశాలాంధ్ర జిల్లా కార్యాలయం
ఈడేపల్లి, ఆంజనేయస్వామి గుడి ఎదుట, మచిలీపట్నం